


పలకరించాడు. "వచ్చావా, అప్పయ్యా!. . . వా కిక నీ అడ్డాలినే యోగంకూడా లేదు. . ."

అప్పయ్య అదిరిపడినట్టు చూశాడు.

". . . చక్కెరవ్యాధిట . . . మాయరోగం ... తీపితినడం మంచిది కాదన్నాడు డాక్టరు. ఏం చెయ్యను, అప్పయ్యా? ఈ జన్మకి నీ అడ్డా తినలేనేమో!"

అప్పయ్యకు చాలా బాధ వేసింది. ఏమీమాటా డలేక తల పంకించి బండి తోసుకుపోయాడు.

మునసబుగారి మేడముందు బండి ఆగింది. మునసబు గారింట్లో చిన్న పిల్లలందరికీ అప్పయ్య పాలకోవా అంటే చాలా ఇష్టం. అందుకనే రోజూ అర్ధరూపాయి పాలకోవా ఇచ్చివెళ్లమనీ, నెలాఖరున డబ్బులు తీసుకోమని చెప్పారు మునసబుగారు. ఎప్పటిలాగే పాలకోవా పొట్లం కట్టి ఇంట్లోకి నడిచాడు అప్పయ్య. మధ్యహాలులో మునసబుగారు వాలుకుర్చీలో కూచుని ఉన్నారు. చప్పుడు విని, తలఎత్తి చూసి "ఓ! అప్పయ్యా?. . ." అన్నాడు. ఆ వెంటనే బాధపడుతున్నట్టుగా మొహం పెట్టి, "నువ్వేమీ అనుకోవు గదా?" అని అడిగారు.

అప్పయ్య ఆశ్చర్యపోయాడు. ఆదుర్దాపడ్డాడు.

"ఏం లేదూ! . . . పిల్లలంతా ఆ శివుడి మిఠాయీ బావుంటుందంటున్నారు. . . వాళ్ల కా పాలకోవా కావాలట. . . అందుచేత. . . నువ్వి నెలకు

## -కె. ఎస్. వి. నరసింహం

డబ్బు తీసుకుని వచ్చే నెలనుండి ఇవ్వడం మానెయ్యి. . ." మునసబు.

చెవులో సీసం కరిగించి పోసి ఉండినా అప్పయ్య అంత బాధపడి ఉండేవాడు కాడు. గిలగిలమని తన్నుకుంటున్న అంతరంగాన్ని అదుపులో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తూ మునసబుగారి ముందు 'అలాగే' అన్నట్టు తల ఆడించి, బండిదగ్గిరికి వచ్చేశాడు. అతని మనస్సప్పుడు మనసులో లేదు.

బండి చావడి దగ్గిరికి వచ్చింది. మామూలుగా

ఆపేచోటే బండి ఆపి చుట్టూ కలయజూశాడు అప్పయ్య. అంతా హడావిడిగా ఉంది. బస్సుస్టాండు లోకి అప్పుడే ఒక బస్సు రావడంతో కోలాహలం హెచ్చింది. కాఫీహోటలు ముందు లౌడ్‌స్పీకర్ లోంచి ఏదో సినిమాపాట బిగ్గరగా వినవస్తోంది. మురుగుకాలవ పక్కన గుడ్డి ముష్టివాడు గొంతెత్తి యాచిస్తున్నాడు. తుమ్మచెట్టుమీద కాకి అరుస్తోంది.

అప్పయ్య విశ్రాంతిగా బండికి ఆనుకున్నాడు. అతని మస్తిష్కమంతా కలగాపులగం అయిపోయింది. అలా అతను పగాడా బండిముందు ఖాళీగా నిలబడుకో లేదు. అలా బండి ఆగీఆగకనే ఎన్ని చేతు లతని ముందుండే వని! పొట్లాలు కట్టలేక అతని చేతులు అరగంటకే అలిసిపోయేవి.

అప్పయ్య మరోమారు చుట్టూ చూశాడు. అరటి పళ్లమ్ముకునే మల్లిగాడు అటు వచ్చాడు.

"ఏమిటప్పయ్యా!. . . విచిత్రంగా ఉంది. . . నీ బండి ఈ వేళ బోసిపోతున్నదే! . . ." మల్లిగాడు.

". . ." అప్పయ్య.

"ఆ శివుడొకడు . . . తనిగాళ్లా దాపరించాడు." మల్లిగాడు.

"ఛ! ఛ అలా అనకు!" అప్పయ్య.

"ఏమిటప్పయ్యా నువ్వు . . . వా డట్లా రోజుకు రోజు నీ బేరంమీద కోత పెడ్తుంటే నువ్వూరు కోవడమేనా?. . . మరో కొత్త బండి చేయించుకో. . . సిక్కావలిస్తే చెప్పు. . . నాకు తెలిసిన వడ్రంగం పనివాడు ఉన్నాడు పట్నంలో. . . పుష్పకవిమానంలాంటి బండి చేయించిఇస్తాను..తస్పదియ్యా! దెబ్బతో శివుడి వ్యాపారం పని దేలిపోవాలి. . ." మల్లిగాడు.

అప్పయ్యంటే మల్లిగాడి కెంతో అభిమానం. ఆ విషయం అప్పయ్యకు బాగా తెలుసు. అతను చిన్నగా నవ్వి అన్నాడు: "లేదు, మల్లీ!... పోన్లే . . . నా కిట్లా గడిచిపోతే చాలు. ఇంక నా కులు మిఠాయి వ్యాపారం చెయ్యాలనే లేదు. . ."

మల్లిగాడు గంగలముని నవ్వాడు. "సరే. . . నీ ఇష్టం. . నాకు మాత్రం నీ యాపార మిట్లా కూలి పోతుంటే చూస్తూ ఊరుకో బుద్ధెయ్యడం లేదు. . ." అని ఒక పావలా అప్పయ్య చేతిలో పెట్టి జిలేబులు కట్టెయ్యమన్నాడు. పొట్లం పుచ్చుకుని వెళ్లిపోతున్న మల్లిగాడిని చూసి బరువయిన నిట్టూర్పు విడిచాడు అప్పయ్య. పోతూ పోతూ మల్లిగాడన్న మాటలు అతని చెవుల్లో మోగుతున్నాయి. అంతలో చావడికేసి వస్తున్న శివుడి బండి కనిపించింది. అది చేరువయ్యే కొద్దీ అప్పయ్య మనసులో భారం ఎక్కువ కాజొచ్చింది.

శివుడి బండి తుమ్మచెట్టుకు కొద్దిదూరంలో ఆగింది. ముసురుకుమస్తున్న చీకట్లలో ఆ రంగురంగుల బండి ఎంతో అందంగా ఉంది. లోపల వెలుగుతున్న కొత్త పెట్రొమాక్సులైటు కాంతి తళతళమని మెరిసి పోతూంది.

అప్పయ్య బండిలో లైటు గుడ్డిగా వెలుగుతూంది. శివుడి బండిలో లైటు దేదీప్యమానంగా ఉంది. అప్పయ్య బండిలో లైటుచుట్టూ దీపంపురుగులు మూగుతున్నాయి.

శివుడి బండిలో లైటు చుట్టూ దీపం పురుగులు మూగుతున్నాయి.

అప్పయ్య బండిదగ్గిర అప్పయ్య తప్ప మరెవ్వరూ లేరు.

శివుడి బండిదగ్గిర శివుడు కనిపించనంతగా క్రిక్కిరిసి ఉన్నారు జనం. డబ్బుల చేతు లతని వేపు సాగుతున్నాయి.

అప్పయ్య నిలుచున్నాడు, శివుడికేసీ, శివుడిబండి కేసీ, శివుడి బండిచుట్టూ మూగిన జనానికేసీ గుడ్లప్పగించి చూస్తూ.

శివుడికి ఊపిరి సలపడం లేదు.

"శివుడూ! నా కా లడ్డూలు కట్టెయ్యి." ఆరేళ్ల కుర్రాడు.

"ఈ పావలాకు. . . జాంగ్రీ ఇయ్యి. . ." నడివయసామిన.

"శివుడూ! ఇంట్లో పిల్లాడేడుస్తుండాడు . . . పాలకోవా కావాలంట. . . ఈ పది పైసలకి కట్టెయ్యి నాయనా." ఒక ఆడగొంతు.

శివుడు చకచకమని పొట్లాలు కడుతున్నాడు. పావుగంట గడిచింది. వెడుతున్నవారు వెడుతున్నట్టే ఉన్నారు గానీ, శివుడి బండిదగ్గిర రద్దీ తగ్గలేదు.

అప్పయ్య పాడుబడ్డగుడి ముందు ముసలి పూజారిలా తన బండి పక్కనే నిలబడి ఉన్నాడు. వెల్లబారిన అతని పెదాలమీద యుగయుగాల వైరాగ్యమూ హాస్యం చేస్తున్నది.

పాతబడిన తన బండి మరింత పాతబడినట్టు, చిరిగిన చొక్కా మరింత చిరిగినట్టు, మాసిన పంచె మరింత మాసినట్టు, పళ్లాలలో ఉన్న మిఠాయిలన్నీ తనను వెక్కిరిస్తున్నట్టు అంతులేని ఆందోళనతో, ఆవిరులైపోతున్న ఆలోచనలతో సతమతమవుతున్నాడు అప్పయ్య.

శివుడు పొంగిపోతున్న ఉత్సాహంతో డబ్బు లందుకుంటున్నాడు. యంత్రం పనిచేస్తున్నట్టు ఒకటి వెంట ఒకటిగా పొట్లాలు కట్టేస్తున్నాడు.

అప్పయ్య నిరామయంగా నిలుచున్నాడు. శివుడు, శివుడి బండి, శివుడి బండిచుట్టూ జనం—అంతా తనను ఎగతాళి పట్టేస్తున్నట్టు తోచిం దతనికి.

"అప్పయ్యా!"

"ఎవరూ?"

పైకిలుసిషాపు రత్నం!

"ఏమిటప్పయ్యా! నాకు తెలీ కడుగతా. . . ఆ శివుడి మిఠాయిలో ఏముందని చెప్పు. . . అట్లా వాణ్ణి పట్టుకుంటారే. . . ఏళ్ల తరబడి నువ్వు చేస్తుండే లడ్డూ ఈ రోజు చేదయిందా?. . ." రత్నం.

అప్పయ్య తల వంచుకున్నాడు.

"నువ్వేమన్నా అనుకో!. . . రోజూ ఒక లడ్డయినా నీ దగ్గిర తినకపోతే నాలిక చచ్చిపోతుందనుకో. . . అప్పయ్యా! కొంపదీసి యాపారం మానుకునేవ్. . . మేమంతా రుచులు చంపుకోవలిసిందే. . ." మళ్లీ అన్నాడు రత్నం.

ఈ మారు అప్పయ్య నవ్వాడు.

రత్నం రెండు లడ్డూలు తీసుకుని, కొంత చిదిమి నోట్లో వేసుకుని, "నేను ఛాలెంజి చేస్తా. . . ఈ రుచి అప్పయ్యచేతి లడ్డూల్లో తప్ప మరెక్కడా ఉండదు. . ." అంటూ వెళ్లిపోయాడు.

అప్పయ్య నిట్టూర్చా డీమారు.


శివుడి బండి దగ్గిర ఒత్తిడి ఇంకా తగ్గలేదు. అతని చొక్కా చెమటలతో తడిసిపోతూంది. అతను


ఏజంట్లు కావలెను

ఉత్తమ రకము కాస్మెటిక్స్, ఫౌంటెన్ పెన్‌లు, గడియారపు పట్టాలు (రోజువారి వాడుకపు వస్తువులు 100) కమిషను, లేక వెలకు రు. 275/- మంచి 450/-ల జీతము మీద అమ్మకమునకు పార్టుటైము/పూర్తి టైము ఏజంట్లు కావలెను. ఉచిత షరతులకు, శాంపిలుకు వ్రాయండి.

METRO AGENCIES (W.A.P.)
Sadar Bazar, Delhi-6.

నెలసరి రు. 5/-ల చెల్లుబడి మీద



స్టాండర్డ్ టబుల్ స్పీకర్

3 బాండ్లు అతి శ్రవంత పోర్టబుల్ ట్రాన్సిస్టర్. ఎక్కడికైనా పంపవచ్చును.

TOKYO AGENCIES (WAP)
Post Bag 11, New Delhi-1.




Internationally known FOR QUALITY RELIABILITY

పెద్ద స్టోర్లన్నిటిలోను లభిస్తుంది. లేదా పి. బి. బాక్సు 2458, కలకత్తాకు వ్రాయండి.

పై బట్టతో మొహంమీది చెమట అప్పుడప్పుడు ఒత్తుకుంటున్నాడు.

అప్పయ్య ఆరిపోయే దీపంలా అక్కడే నిలబడ్డాడు. అతని శరీరం వెచ్చబడింది. కచేరీనుండి ఠంగుఠంగు మని ఎనిమిది గంటలు వినిపించాయి. అప్పయ్యకు ఇంకా అక్కడ నిలబడా లనిపించలేదు. శివుడి బండికేసి మరోమారు చూసి నెమ్మదిగా బండిని వెనక్కి తిప్పుకున్నాడు.

పొట్లాలు కడుతున్న శివుడు అప్పయ్య బండికేసి చూడకుండా ఉండలేకపోయాడు. ఎందుకోగాని అతను చప్పున తల దించేసుకున్నాడు.

నిస్సత్తువగా ఉన్న చేతులతో బండిని తోసుకు పోయాడు అప్పయ్య. మరో పావు గంటకల్లా అతను ఇల్లు చేరాడు. బండిని యథాస్థానంలో ఉంచి ఇంటి తలుపు తోసిన అతను ఆశ్చర్యపోయాడు.

ఇల్లంతా చీకటిగా ఉంది.

"కనకా!. . ." అని పిలిచాడు.

సమాధానం రాకపోవడంతో ఆదుర్దాపడి తడుము కుంటూ లోపలికి వెళ్లాడు. గదిమధ్యలో గుంజకు తల కొట్టుకుంది. మరోమారు "కనకా!. . ." అన్నా డతను.

ఈ మారొక మూలనుండి సన్నటి మూలుగు వినిపించింది. అప్పయ్య చప్పున జేబులోంచి అగ్గిపెట్టె తీసి గూటిలో దీపం తడిమి, వెలిగించి మూలుగు వినిపించిన మూలకు నడిచాడు.

"వచ్చావా!. . ." అన్నది కనకం కుక్కి మంచంలో అతనివేపు తిరుగుతూ.

అప్పయ్యలో ఆదుర్దా అధికమైంది. "ఏమి టిలా ఉన్నావు?" అన్నాడు.

కనకమ్మ మరోమారు మూలిగి అలసటగా కళ్లు మూసుకుంది.

అప్పయ్య కంపిస్తున్న చేతిని ఆమె నుదుటిమీద వేసి చురుక్కుమనడంతో వెంటనే తీసేశాడు.

"ఇంత జ్వరం కాస్తూంటే అట్లాగే ఊరుకుంటా వేం?"

"నువ్వట్లా వెళ్లావో లేదో. . . కళ్లు తిరిగినట్లనిపిం చింది. . . గెంజి కాసుకుని తాగాను. . . ఇంకా ఎక్కు వైంది. . . కణత లదిరిపోతున్నాయి. . ." కనకమ్మ.

అప్పయ్య క్షణం ఊరుకుని, "ఇంత హఠాత్తుగా వచ్చింది. . . ఏం జబ్బో ఏమో. . . డాక్టరు దగ్గిరికి పోదాం పద. . ." అన్నాడు.

కనకమ్మ మరింత నీరసపడిపోతూ, "ఇప్పుడేం వద్దు. . . అంతకయితే. . . రేపటికికూడా తగ్గక పోతే పోదాంలే" అంది.

అప్పయ్య ఆమె కళ్లలోకి లోతుగా చూసి వెంటనే మొహం తిప్పేసుకున్నాడు. అతడి మాసిన చొక్కా చేతిని సవరిస్తూ ఉండిపోయింది కనకమ్మ. చాలా సేపటికి "అన్నంలోకి కూరేమీ వండలేదు. . . మధ్యాహ్నం చారే ఉంది. . ." అంది.

"నా కివ్వాళ ఏమీ ఆకలిగా లేదు. . ." అప్పయ్య.

"ఏం? నీకూ ఏమయినా జబ్బా?" కనకమ్మ.

ఆమె నవ్వింది.

అంత జబ్బులోనూ స్వచ్ఛంగా నవ్వుతున్నందుకు ఆమెను లోలోపల అభినందించుకున్నా డతను. ఆ వెంటనే ఆమె ముంగురులమీద చెయ్యి వేసి, "అవును. . . ఇరవయ్యేళ్ల ముందు నిన్ను చూశాను. . . అప్పటినుండి ఇంకా జబ్బు మనిషినే!" అన్నాడు.

కనకమ్మ ఎప్పటిలాగే గడుసుగా మెడ తిప్పింది. నవ్వింది. "ఈ కబుర్లకేం వచ్చిందిలే! ముందెళ్లి భోజనం కానియ్యి" అంది.

అప్పయ్య ఆమె ఆజ్ఞను శిరసావహిస్తున్నట్టుగా లేచి వెళ్లి పది నిమిషాలలో రెండు మెతుకులు నమిలి చెయ్యి కడుక్కున్నాడు.

"అప్పుడే భోజనమయిందా?" కనకమ్మ.

అప్పయ్య మౌనంగా ఎటో చూస్తుండిపోయాడు. అతనికేమీ తోచడం లేదు. పీల్చడానికికూడా గాలి లేకపోయినంతగా ఇబ్బంది పడిపోతున్నాడు. ఆమెతో ఏవేవో చెప్పాలనిపిస్తూంది కానీ, ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో తెలిసిరావడంలేదు.

"ఏమి టదో మాదిరిగా ఉన్నావు...?" కనకమ్మ.

అప్పయ్య సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచి, నిస్పృహ ధ్వనిస్తున్న గొంతుకతో, "మన మిక బ్రతకలేము..." అన్నాడు. ఆ మాట విని కనకమ్మ ఆదుర్దాపడి తెల్ల మొహం వేస్తుందనుకున్న అతని అంచనా తప్పయింది. ఆమె తన కా విషయం ముందే తెలుసునన్నట్లు సన్నగా నవ్వింది. దానితో అప్పయ్య తికమక పడిపోయాడు.

కనకమ్మ అతణ్ణి శోధిస్తున్నట్టు చూసి, "నీకు శివుడిమీద కోపంగా ఉందా" అని అడిగింది.

"బలేదానివే! ఎందుకొచ్చింది నీ కా సందేహం?" అప్పయ్య.

కనకమ్మ మాట మార్చింది. "శివుడి పెళ్లిట. . . విన్నావా?" అంది.

అప్పయ్య లోలోపల ఆశ్చర్యపడినా పైకి ఏమీ తొణక్కుండా, "ఆహా!" అన్నాడు. ఆ వెంటనే అతనికి తెలియకుండానే, "ఎప్పుడు?" అన్న ప్రశ్న అతని నోటి నుండి వెలువడింది.

"శుక్రవారం రాత్రి. . ." కనకమ్మ.

అప్పయ్య తల వంకించి పక్కమీద మేను వాల్చాడు బరువుగా కళ్లు మూసుకున్నాడు.

కనకమ్మ నిట్టూర్చి మరోవేపుకు తిరిగి పడుకుంది. అప్పయ్య ఆ రాత్రి రెండున్నర గంటలకు గాని నిద్ర లోకి జారుకోలేదని ఆమెకు తెలియదు.

* * *

పడుచుదనం సంతరించుకుంటున్న బాలభానుని పదునైన కిరణాలు కిటికీగుండా సూటిగా ముఖం మీద పడటంతో మరోవేపు తిరిగి పడుకోబోయాడు అప్పయ్య. అంతలో అతనికి ఇంటిముంగిటనుండి అంతగా పరిచయంలేని కొత్తగొంతు వినిపించింది. కనకమ్మ గొంతుక ఏదో సమాధానం చెబుతూంది. అప్పయ్య మంచంమీద చివ్వున లేచి కూచున్నాడు. అంతలో కనకమ్మే అక్కడికి త్వరత్వరగా వచ్చింది. ఆమె అతనికి చాలా దగ్గిరగా వచ్చి, "శివుడు వచ్చాడు" అంది. అప్పయ్య ఆశ్చర్యంతో క్షణం అలాగే ఉండి పోయి, గబుక్కున పైగుడ్డతో ముఖం తుడుచు కున్నాడు. అలాగే గుమ్మం కేసి నడిచి, అవతల నిలబడి ఉన్న శివుణ్ణి చూసి, "లోపలికి రా!" అన్నాడు.

శివుడు గుమ్మానికి తల తగలకుండా లోపలికి వచ్చాడు. తెల్లటి ఇస్త్రీబట్టల్లో అతడు తళతళమని మెరిసిపోతున్నాడు. చేతిలోంచి పెళ్లిపత్రిక తీసి అప్పయ్య చేతిలో ఉంచి, "నా పెళ్లి!" అన్నాడు.

అప్పయ్య చిన్నగా నవ్వాడు.

"తప్పకుండా రావాలి! అంతేగాదు, పెళ్లిపంటకాలన్నీ దగ్గిరుండి మీరే చేయించాలి." శివుడు.

"కాని. . . కాని. . . కనకానికి ఒళ్లు బాగోలేదే!" అప్పయ్య నసిగాడు. అతను సూటిగా శివుడికేసి చూడలేక పోతున్నాడు.

"అట్లా అంటే నేనేం చెప్పేది. . ." శివుడు.

"అవుననుకో. . . కనకానికి బావులేదే. . ." అప్పయ్య.

శివు ఓమారు అప్పయ్యకేసి సూటిగా చూసి, తనంతా గ్రహించినట్లు పెదవుల వెనకే నవ్వుకున్నాడు. వంటింటి గుమ్మాన్ని ఉద్దేశించి "అమ్మా!" అన్నాడు.

కనకమ్మ ఉలికిపాటును తప్పించుకోలేకపోయింది.

శివు డంటున్నాడు: "నువ్వయినా చెప్పమ్మా! తల్లీ, తండ్రీ లేనివాణ్ణి ... నాకు మీకన్నా ఎవరున్నారు. . . నన్ను మీ బిడ్డణ్ణిగా ఎంచుకోలేరా! నా మీదామాకే కోపం?. . ."

కనకమ్మ నిగ్రహించుకోలేకపోయింది. "ఓ మా టిలా వచ్చిపోతావా?" అంది అప్పయ్య నుద్దేశించి. అప్పయ్య ఆమె దగ్గిరికి వెళ్లి తల ఎత్తుకోలేకపోయాడు.

కనకమ్మ అతణ్ణి నిశితంగా చూసి, "నీకు శివుడి మీద నిజంగా కోపం లేదా? నిజం చెప్పు!" అంది.

ఆ వెంటనే ఆమె అప్పయ్యతోబాటు శివుడి దగ్గిరికి వచ్చింది. "ఆయన్ని నేను పంపుతాలే, శివుడూ!" అంది.

"నువ్వమ్మా?" శివుడు.

కనకమ్మ నవ్వింది.

శివుడు "అమ్మా" అని మాత్రం అనగలిగాడు. ఆ వెంటనే అతను చప్పున వంగి వాళ్లిద్దరి పాదాలూ స్పృశించి కళ్లకద్దుకుని, "ఇది మీ కొడుకు పెళ్లి అనుకోలేరా?" అన్నాడు.

అప్పయ్య కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. ఆ మసక తెరలలో పండి కూలిపోతున్న తల్లిచెట్టు కిందనే తలలెత్తే లేత అరటిమొక్కలు మెదిలాయి. ★



"ఈ బిల్లు చూస్తూంటే డాక్టరుగారూ, మీరు నాకు భూతద్దాలు పెట్టారేమో నని భయంగా ఉందండీ!"